క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



నకరికల్లు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని డీబీఆర్సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అన్నారు. దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యాన మండలంలోని కండ్లకుంట గ్రామంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని వీధులను సమష్టిగా శుభ్రం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్లలో చెత్తచెదారం, వ్యర్థాలు రోడ్లపై వేయడంతో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలుతాయన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

121 మందికి అన్నదానం

సత్తెనపల్లి: భరతమాత అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా దాతల సహకారంతో పట్టణంలోని యానాది కాలనీలో 121 మంది నిరుపేదలకు మంగళవారం అన్నసంతర్పణ చేశారు. మాచవరం మండలం ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి దేవరపల్లి గౌరీ శంకర్ జన్మదినం సందర్భంగా అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

విశిష్ట అధ్యాపక పురస్కారానికి శ్రీనివాసరెడ్డి ఎంపిక



పెదకూరపాడు : పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ఎ. శ్రీనివాసరెడ్డికి 'ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం' సందర్భంగా 'మండలి వెంకట కృష్ణారావు శతజయంతి విద్యాసేవ, వేములపల్లి మాణిక్యాలరావు ఆదర్శ అధ్యాపక' పురస్కారాన్ని ఇస్తున్నట్లు 'విద్యార్థి వికాస వాహిని' సంస్థ ప్రకటించింది. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయులుగా, వ్యాసకర్తగా విద్యారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని శ్రీనివాసరెడ్డికి ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన

సత్తెనపల్లి: ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం (ఏపీపీహెచ్‌సీడీఏ) పిలుపు మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మెబాటలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు సత్తెనపల్లి డివిజన్ నుంచి వైద్యులు తరలి వెళ్లారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మొరపెట్టుకున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వైద్యులు విధులను పక్కనపెట్టి ప్రభుత్వ తీరును నిరసిస్తూ సమ్మెకు దిగారు. అక్టోబర్ 2 వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టి 3వ తేదీ నుంచి విజయవాడలో వైద్యాధికారుల నిరసనలు, నాయకుల నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. పల్లెల్లో వైద్య సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో రోగులకు ఇబ్బంది తప్పడం లేదు.

అనుమానితులపై కేసు నమోదు

మంగళగిరి టౌన్: అర్ధరాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మంగళగిరి రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ మంగళగిరి మండల పరిధిలోని కాజ గ్రామం వెంకటరెడ్డి అండర్‌పాస్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణ చేయగా విజయవాడకు చెందిన వారిగా గుర్తించామని, అర్ధరాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కారణంగా కేసు నమోదు చేసి, సోమవారం మంగళగిరి తహసీల్దార్ ఎదుట హాజరుపరి బైండోవర్ చేసినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో అవసరం లేకుండా తిరిగేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళా సంఘాలకు రుణాల మంజూరుకు కృషి

శావల్యాపురం: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల అభ్యున్నతికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆ బ్యాంకు నరసరావుపేట రీజనల్ మేనేజర్ పి.రవికుమార్ అన్నారు. మంగళవారం శావల్యాపురం బ్రాంచ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 41 బ్యాంకు శాఖలు ఉండగా 10 వేల మహిళా గ్రూపులు ఉన్నాయని, మొదట విడతలో భాగంగా అర్హత కల్గిన 20 వేల మంది మహిళలకు యూనిట్ ఆధారంగా రూ. 2లక్షల నుంచి రూ. 10లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణసదుపాయం కల్పించనున్నామన్నారు. ఇందులో భాగంగా రూ. 400 కోట్లు నిధులు కేటాయించామని ఈనెల 31లోగా అర్హులను గుర్తించి రుణాలు మంజూరు చేస్తామన్నారు. శావల్యాపురం బ్రాంచి మేనేజరు వలేటి ప్రసాదు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అడ్డూ అదుపులేని ఆక్రమణలు!

- రాజుపాలెంలో రహదారికి ఇరువైపులా ఆక్రమణలు
- తొలగించాలని ప్రజల విజ్ఞప్తి



రాజుపాలెం గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు

రాజుపాలెం: ఆక్రమణదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. జాగా కనపడితే ఆక్రమించుకోవడమే. ప్రభుత్వ స్థలాలను బజారులను కూడా వదలడం లేదు. ప్రజలు వారిని ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నారు. అధికారులకు తెలిసినాచోద్యం చూస్తున్నారు. ఇది ఎక్కడో కాదు నిత్యం అధికారులు తిరిగే స్థలమే. ఇది మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం పక్కన ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డుకిరువైపులా ఓ 20 మంది వరకు పోటాపోటీగా ఇంతవరకు నాదీ, ఇంతవరకు నాదీ అని ఆక్రమించుకున్నారు. కొంతమంది రేకుల షెడ్‌లు నిర్మించుకుని బడ్డీలు కూడా ఏర్పాటు చేశారు. ఇది నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో ప్రజలు ఆక్రమణదారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం పక్కన ప్రస్తుతం కొంత స్థలం ఖాళీగా ఉంది. అది రాజుపాలెం పంచాయతీ ఆధీనంలో ఉంది. ఆ స్థలం పక్కనే 15 అడుగుల సీసీ రోడ్డును గ్రామంలోకి వెళ్లేందుకు ప్రధాన రహదారిగా ఏర్పాటు చేశారు. దానికి పడమర వైపున కాశిమ్మ సత్రం, తూర్పువైపున ఆక్రమించుకున్న ఖాళీ స్థలం. ఉత్తరం వైపున రైల్వేగేటు, గేటు ఎదురుగా పోలీసు స్టేషన్ ఉన్నాయి. దక్షిణం వైపున బస్టాండ్ ఉంది. నిత్యం ఈ ప్రధాన రహదారిపై నుంచి గ్రామస్తులు వెళుతూ ఉంటారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే అధికారుల వాహనాలు, స్టేషన్ పనిమీద వచ్చే వాహనాలను ఈ ఖాళీ స్థలంలోనే ఆపుకొంటారు. కాశిమ్మ సత్రానికి ఎదురుగా ఉన్న స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకుని పక్కా రేకుల షెడ్‌లు నిర్మించుకోవడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖాళీ చేయిస్తాం

రాత్రికి రాత్రే ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకున్నారని మా దృష్టికి వచ్చింది. మూడు రోజుల్లో ఆక్రమణలు తొలగించాలని నోటీసులు ఇచ్చాం. ఆక్రమణదారులు స్పందించక పోతే దగ్గర ఉండి ఖాళీ చేయిస్తాను. కాశిమ్మ సత్రం ముందు ఉన్న ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయిస్తాం. ఈ అంశాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తాను.

–హర్షిత ప్రియదర్శిని,
పంచాయతీ కార్యదర్శి, రాజుపాలెం

స్పందన కరువు

పది రోజుల క్రితం రాత్రికి రాత్రే కొంతమంది ఆ ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మూడు రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. అయినా ఆక్రమణదారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. అధికారులు మాత్రం నిమ్మకుండిపోయారు.

రేబిస్‌పై ప్రజల్లో అవగాహన అవసరం

క్రోసూరు: పెంపుడు జంతువుల్లో, కుక్కల్లో ఉండే రేబిస్ వైరస్ వాటి కాటుతో మనిషి శరీరంలోకి చేరుతుందని, ఒక్కొక్కసారి రేబిస్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలతో బయటపడటం కష్టమని ముందు జాగ్రత్తలు చాలా అవసరమని క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేబిస్ వ్యాధి వారోత్సవాల సందర్భంగా కుక్కకాటు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ వ్యాధి కారక క్రిమి జంతువుల లాలాజలం (సొంగ) లో ఉంటుందని వివరించారు. ఇది మనుషుల్లోనే కాదు జంతువుల్లో కూడా రేబిస్ వ్యాధిని కలుగజేస్తుందన్నారు. తక్షణమే వైద్య నిపుణులు సంప్రదించి చికిత్స పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని శాంసన్ సూచించారు.

శునకాల దాడి

ఒకేరోజు 15 మందిని కరిచిన వీధి కుక్కలు

పెదకూరపాడు: పెదకూరపాడు మండలం పోడపాడు, బుసాపురం, పాటిబండ్ల గ్రామాల్లో మంగళవారం వీధి కుక్కలు దాడి చేసి 15 మందిని కరిచాయి. వాహనచోదకులు, పాదచారులను లక్ష్యంగా చేసుకొని వెంటపడ్డాయి. పాటిబండ్లలో రెండు నెలలుగా సుమారు 40 మంది బాధితులు కుక్క కాటుకు గురయ్యారు. రాత్రి వేళల్లో బయటకు రాలేకపోతున్నామని కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గే దుర్గతి నాశిని



నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో..



సత్తెనపల్లి త్రిశక్తిదుర్గా పీఠంలో దుర్గాదేవి



కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద..



బెల్లంకొండలో మహాదుర్గగా..

దసరా ఉత్సవాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: శరన్నవరాత్రుల్లో భాగంగా సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో దేవీ ఆలయాలన్నీ తొమ్మిదో రోజైన మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం, త్రిశక్తి దుర్గాపీఠం, గుంటూరురోడ్డులోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతికాలనీలోని లక్ష్మీ ప్రత్యంగిరా అమ్మవారి పీఠంలో శ్రీనీలంపాటి లక్ష్మీ అమ్మవారిని, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని మేదరసంఘ రామాలయంలో, వడ్డవల్లి పెద్ద బొడ్డురాయి సెంటర్‌లో, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టువద్ద, వడ్డవల్లి శ్రీరామాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వ హించారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని రేణుకా అంకమ్మ దేవాలయంలో, పెదమక్కెన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

అనంతవరం(క్రోసూరు): అనంతవరం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు మంగళవారం సరస్వతీదేవీగా భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు.

క్రోసూరు: క్రోసూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

అచ్చంపేట: స్థానిక సీతారామస్వామి దేవాలయంలో మంగళవారం సీతాదేవి ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

ముప్పాళ్ళ: లంకెలకూరపాడు శివాలయంలో, చాగంటివారిపాలెంలోని పైడమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

నకరికల్లు: చేజర్లలోని శ్రీగంగాభ్రమరాంబ పార్వతీ సహిత కపోతేశ్వరస్వామి ఆలయంలో, నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రాజుపాలెం: బ్రాహ్మణపల్లి శివాలయంలో శ్రీఅన్నపూర్ణాదేవిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. మండల కేంద్రంలోని అంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బెల్లంకొండ: స్థానిక మహాలక్ష్మీ పీఠంలో మంగళవారం అమ్మవారు మహాదుర్గ అలంకరంలో విశ్వరూప దర్శనమిచ్చారు.



కొమెరపూడి రేణుకా అంకమ్మ ఆలయంలో..



అనంతవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



అచ్చంపేట సీతారామస్వామి ఆలయంలో..



క్రోసూరు వాసవి ఆలయంలో..

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు

- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి
- పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కదం తొక్కిన శ్రేణులు
- నరసరావుపేటలో నిరసనకు భారీగా తరలిన ఎస్సీ నాయకులు



మాట్లాడుతున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, పక్కన ఎస్సీ సెల్ నాయకులు

సత్తెనపల్లి: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం తగదని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి హితవు పలికారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నేతలు టీజేఆర్ సుధాకర్ బాబు, కొమ్మూరు కనకారావు సూచనలతో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. పార్టీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిలుకా జైపాల్ ఆధ్వర్యంలో పార్టీ ఎస్సీ సెల్ విభాగ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అంటే పేదలకు వైద్య విద్యను దూరం చేసి వ్యాపారం చేయడమే చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా మారిందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందు చూపుతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకురావడమే కాక వాటిలో ఐదు మెడికల్ కాలేజీల్లో తరగతులు జరుగుతుండగా, రెండు మెడికల్ కళాశాలలు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయన్నారు. అలాంటి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు ధారాదత్తం చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దశల వారీ ఉద్యమంలో భాగంగా ఎస్సీ సెల్ విభాగ నాయకులు నిరసన తెలియజేయడాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ జానీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దింటి నాగేశ్వరరావు, దళిత నాయకులు జూపల్లి పాల్, వేల్పుల అఖిల్, చిలుక రమణయ్య, ముప్పాళ్ళ, రాజుపాలెం మండలాల ఎస్సీ సెల్ కన్వీనర్లు చావా రమేష్, బోధాల సీతారామయ్య, తొండపి సర్పంచ్ బోరుపోతు కాటయ్య, లక్కరాజుగార్లపాడు ఎంపీటీసీ జొన్నలగడ్డ సాగర్, అంకాల డేవిడ్, గుంటగాని అభి, బండారు అనిల్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పందుల సంచారం



గురుకుల పాఠశాల రోడ్డులో తిరుగుతున్న పందులు

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతిలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి.
కృష్ణానది ఒడ్డున పందుల పెంచితే తమకు ఇబ్బందిగా ఉందని, పందులు ఇళ్ల మధ్యలో సంచరించటం వల్ల అనారోగ్యాలు వస్తున్నాయని 1, 2వార్డుల ప్రజలు పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు సున్నా. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పక్కన కాలనీలో పందులు సంచరిస్తున్నాయి. బస్టాండ్ ఆవరణలోని ముళ్ల కంపల్లోని మురుగునీటిలో పందులు స్థావరాలు ఏర్పచుకుని కాలనీలో తిరుగుతున్నాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముందని కాలనీవాసులు భయపడుతున్నారు ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలి.

'ఊటుకూరు'లో నీటి సమస్య పరిష్కరించండి

ఊటుకూరు(క్రోసూరు): ఊటుకూరు దళితవాడలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రవిబాబు కోరారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నేతలు సచివాలయ సిబ్బందికి మెమొరాండం ఇచ్చారు. రవిబాబు మాట్లాడుతూ ఊటుకూరు గ్రామంలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా 9 ,10 వార్డుల్లోకి వచ్చే మంచినీటి పైపులైనుకు సరిగా నీరు రాక కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జలజీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా జరగడంతో ఇంటింటి కుళాయి పనులు ఆగాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటి కుళాయి పనులను సిమెంట్ రోడ్డు పగలగొట్టకుండా జింకు పైపులు వేసి పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ శాఖ సహాయ కార్యదర్శి గన్నెపూడి మహేష్ జల్లి నాగభూషణం జి. రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.



'మైక్రో ఫైనాన్స్'తో పేద కుటుంబాలు ఛిద్రం

ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి రజిని



సమావేశంలో మాట్లాడుతున్న రజిని

సత్తెనపల్లి: మైక్రో ఫైనాన్స్ సంస్థలతో పేదల కుటుంబాలు ఛిద్రమౌతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)పల్నాడు జిల్లా కార్యదర్శి జి రజిని అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్ లో మంగళవారం జరిగిన ఐద్వా సత్తెనపల్లి పట్టణ కమిటీ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ఐద్వా పట్టణ అధ్యక్షురాలు కె.సుధారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ సంస్థల కారణంగా చాలా పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీని నుంచి పేదల కుటుంబాలు విముక్తి పొందాలంటే డ్వాక్రా సంఘాల కు వడ్డీ లేని రుణాలు మంజూరు చెయ్యాలన్నారు. పొదుపు నుంచి అంతర్గత రుణాలు తీసుకునే విధంగా ప్రభుత్వం బ్యాంకులు గ్రూపులకు వర్తింపజేయాలన్నారు. అభయ హస్తం డబ్బులు తిరిగి ఇవ్వాలని, స్త్రీ నిధి పొదుపు నుంచి వసూలు చేసిన డబ్బులను సభ్యులకు పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సత్తెనపల్లి పట్టణంలో ప్రచారం చేయాలని సమావేశం తీర్మానం చేసింది. ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ మాట్లాడుతూ అనంతపురంలో జరిగే ఐద్వా మహాసభలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మహిళల మీద జరిగే హింసను అరికట్టాలని, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని తదితర అంశాలపై చర్చించి కార్యచరణను రూపొందిస్తారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని కేరళ ప్రభుత్వం మాదిరి 14 రకాల నిత్యావసర వస్తువులను, సన్నబియ్యం సరఫరా చేయాలని ఆమె డిమాండ్ చేశారు.
వైద్యం, విద్య ప్రైవేటీకరణఆపాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మహిళ నాయకులు మునగా జ్యోతి, కట్టా రమదేవి, జడ స్పందన, లక్ష్మి, ఎం. రమాకుమారి పాల్గొన్నారు.

10 మందికి సేవారత్న అవార్డులు ప్రదానం



సేవారత్న అవార్డులు అందుకున్న వారితో దీపాల పరంధామయ్య

సత్తెనపల్లి: ఆశ్రయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన వివిధ రంగాల్లో సేవలందించిన వారిని గుర్తించి వారికి సేవారత్న అవార్డులను అందిస్తోంది. దీనిలో భాగంగా పరివర్తన చెవిటి మూగ మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వివిధ రంగాల్లో సేవలందించిన 10 మందికి సేవారత్న అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు అచ్చిరెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ దీపాల పరంధామయ్య అవార్డ్ గ్రహీతలైన కడప న్యాయవాది డాక్టర్ ప్రభాకర్ జాలా, క్రోసూరుకు చెందిన గార్లపాటి దాసు, చిలకలూరిపేటకు చెందిన పల్లెపోగు రవిరాజ్, గుంటూరుకు చెందిన నన్నెపాగ ప్రశాంతి, మంగళగిరికి చెందిన బుల్లా రాజారావు, మైలవరానికి చెందిన పల్లపోతుల గోపాల్, గుంటూరుకు చెందిన డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, గుంటూరుకు చెందిన కిలారి శ్రీపద్మ లత, సత్తెనపల్లికి చెందిన బిషప్ ముక్తిపూడి సత్య కిరణ్, హిందూపురానికి చెందిన ఎరుకల శంకరయ్యలకు సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. సర్టిఫికెట్, మెమెంటో అందజేసి శాలువా కప్పారు. ఈ సందర్భంగా అవార్డ్ గ్రహీతలు సమాజానికి చేసిన సోషల్ సర్వీసును పలువురు కొనియాడారు. పరివర్తన ఆశ్రమ పాఠశాలకు ఒక బస్తా బియ్యాన్ని ట్రస్టు చైర్మన్ దీపాల పరంధామయ్య అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు క్రీడారత్న కురం శివ రామ శేషయ్య, ముదిగొండ ఈశ్వర్, వెల్లటూరి మహేష్, మన్నం చిన కోటేశ్వరరావు, బండారు రవి తదితరులు ఉన్నారు.

రేపు ఈఎన్‌టీ ఉచిత వైద్యశిబిరం

నరసరావుపేట: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రెండో తేదీ గురువారం గుంటూరురోడ్డులోని కొండవీడు ఈఎన్‌టీ హాస్పటల్‌లో ఉచిత చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన హాస్పిటల్‌లో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. వినికిడి లోపం ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు చేస్తామని, ప్రతి డిజిటల్ ప్రోగ్రామబుల్ చెవిటి మిషన్‌పై 30శాతం రాయితీ, వర్టిగో (తల తిరుగుడు) పరీక్షపై 20శాతం రాయితీ ఇవ్వబడుతుందన్నారు. లాటరీ పద్ధతి ద్వారా 10 మందిని ఎంపిక చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని, మందులు ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు.

భర్త, అత్తపై మహిళ ఫిర్యాదు

సత్తెనపల్లి: దాడికి పాల్పడ్డారు అంటూ భర్త, అత్తపై ఓ మహిళ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రఘురాం నగర్‌కు చెందిన చిలుక సురేంద్ర డ్యానీకి, సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామానికి చెందిన కోలా త్రివేణికి 8 నెలల క్రితం వివాహమైంది. వివాహమైన కొద్ది రోజులకే త్రివేణి తండ్రి శ్రీశ్రీకి నోటి క్యాన్సర్ వచ్చింది. ఈ క్రమంలో తనకు కూడా క్యాన్సర్ వచ్చి ఉంటుందని, అందుకే తగ్గిపోతున్నావు అంటూ భర్త సురేంద్ర డ్యానీ, అత్త విజయ దాడికి పాల్పడ్డారని త్రివేణి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జె.శ్రీనివాసరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.